## క్లుప్తంగా

### స్పందనకు రెండు వినతులు



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

గజపతినగరం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి రెండు వినతులు అందినట్లు ఎంపీడీఓ పప్పు సుదర్శనం తెలిపారు. వాటిని పరిశీలించి సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ ఎం.అరుణకుమారి, పలు శాఖల అధికారులు ఉన్నారు.

### సత్తా చాటిన గురుకుల విద్యార్థినులు



కబడ్డీ పోటీల్లో రాణించిన విద్యార్థినులతో జిల్లా సమన్వయాధికారి చంద్రావతి, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు

వేపాడ: విజయనగరం రాజీవ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థినులు సత్తా చాటారు. ఈ పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచింది. ఈ జట్టులో వేపాడ, చీపురుపల్లి, నెల్లిమర్లకు చెందిన గురుకులల విద్యార్థినులు మంచి ప్రతిభ కనబరిచారు. క్రీడాకారులను గురుకులాల జిల్లా సమన్వయాధికారి చంద్రావతి అభినందించారు.

### నవధాన్యాల కిట్లు పంపిణీ



రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేస్తున్న ఆర్‌బీకే సిబ్బంది

శృంగవరపుకోట: మండలంలోని పలు రైతుభరోసా కేంద్రాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నవధాన్యాల సాగుపై సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నవధాన్యాలు సాగు చేయడం ద్వారా నేల సారవంతం అవుతుందని, ఫలితంగా ఎరువుల వినియోగం తగ్గుతుందని, తద్వారా సాగు ఖర్చు తగ్గుతుందని వివరించారు. అనంతరం వివిధ రకాల విత్తనాలను 10 కిలోల చొప్పున ప్యాకింగ్ చేసి రైతులకు పంపిణీ చేశారు.

### గోభ్యాంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



గోభ్యాంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సతీష్

దత్తిరాజేరు: మండలంలోని గోభ్యాంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి సతీష్‌కుమార్ గ్రామంలో సుమారు 60 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగుల ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి జనార్దనరావు

దత్తిరాజేరు: సమస్యల పరిష్కారంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి జనార్దనరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో పాల్గొని వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సచివాలయాల స్థాయిలో వచ్చిన ఫిర్యాదులను కార్యదర్శులు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ పరమైన సమస్యలపై తహసీల్దార్ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు.

# వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ రఘురాజు
- పురస్కారాలు పొందిన వలంటీర్లకు సత్కారం



చీపురుపల్లి: సేవారత్న పురస్కారాలు పొందిన వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, తదితరులు

మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం గ్రామ వలంటీర్ వ్యవస్థతో సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందించడంతో పాటు ప్రభుత్వం చేపట్టే పలు కార్యక్రమాల్లో వలంటీర్లు కీలక భూమిక పోషిస్తూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధాన కర్తలుగా వ్యవహరిస్తున్నారు. వలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. వారి నిస్వార్థ సేవలను గుర్తిస్తూ ఏటా ప్రభుత్వం సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలతో వారిని ఘనంగా సత్కరిస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను గ్రామ సచివాలయాల వారీగా ఎంపిక చేసి స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు సత్కరిస్తున్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో సేవలందిస్తున్న వలంటీర్లను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సోమవారం సన్మానించారు. గంట్యాడ మండలం పెదమజ్జిపాలెంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య వలంటీర్లను సత్కరించగా, లక్కవరపుకోట మండలం కళ్లేపల్లిలో, జామి మండలం జేడీవలస గ్రామంలో ఎమ్మెల్సీ రఘురాజు, పలువురు ప్రజాప్రతినిధులు వలంటీర్లకు సన్మానం చేశారు. వారి సేవలను అభినందించారు. ముఖ్యమంత్రి మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు మెరుగైన సేవలందించాలని, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



గంట్యాడ: సత్కారాలు పొందిన పెదమజ్జిపాలెం గ్రామ వలంటీర్లతో ఎమ్మెల్యే అప్పలనరసయ్య



లక్కవరపుకోట: కళ్లేపల్లి గ్రామంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, ఎంపీపీ శ్రీనివాసరావు తదితరులు



గుర్ల: దమరసింగిలో వలంటీర్లను సత్కరిస్తున్న జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, తదితరులు



జామి: జేడీవలసలో వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రఘురాజు, ఎంపీపీ ఎస్.అరుణ, జెడ్పీటీసీ జి.సరయు, తదితరులు



బొండపల్లి: ఎం.కొత్తవలసలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ చలంనాయుడు, అధికారులు, ప్రజాప్రతినిధులు



మెరకముడిదాం: సోమలింగాపురంలో వలంటీర్లను సన్మానిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, తదితరులు

# గడపగడపకూ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గడపగడపకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మేజర్ పంచాయతీ పరిధిలోని జి.అగ్రహారంలో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాయకులతో కలిసి ఎంపీ గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి నాలుగేళ్లుగా వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అర్హత ఉండి కూడా ఎవరికైనా పథకాలు రాకపోతే తక్షణమే సచివాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. సిఫార్సులకు, అవినీతికి తావులేకుండా..పేదలందరికీ సంక్షేమ పథకాలను ప్రతీ నెలా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే అని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, కొసిరెడ్డి రమణ, డీజే, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల స్థలాలను శ్మశానవాటికతో పోల్చడం సరికాదు



వేపాడ: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకుల నిరసన ర్యాలీ

- తక్షణమే చంద్రబాబు ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు

వేపాడ: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలను ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు శ్మశానవాటికతో పోల్చటం సరికాదని, ఆ మాటలను వెనక్కి తీసుకుని పేదలకు క్షమాపణలు చెప్పాలని డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు డిమాండ్ చేశారు. ఎస్.కోటలో సభలో పాల్గొన్న ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు ప్రభుత్వంపై, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలను ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా చినరామునాయుడు మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉండగా పేదలకు ఒక సెంటు భూమి కూడా ఇవ్వలేదని, కానీ నేడు జగనన్న ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే వాటిని శ్మశానవాటికలు, సమాధులు అంటూ మాట్లాడటం సరికాదన్నారు. జడ్పీటీసీ ఎస్.అప్పారావు మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై తప్పుడు మాటలు మాట్లాడితే ప్రజలు సహించరని, వచ్చే ఎన్నికల్లో టీడీపీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, ఏఎంసీ చైర్మన్ మూకల కస్తూరీ, నెడ్‌క్యాప్ డైరెక్టరు సీహెచ్ పద్మావతి, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, మండల వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు, పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌చార్జి మెరపల సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు శ్రీరామ్మూర్తినాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

# 'జగనన్న ఆణిముత్యాలు'కు ఎంపిక



మునకాల ఉమ



దాసరి షణ్ముఖరావు



ఆర్.జ్యోత్స్న

గుర్ల: జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలకు గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మునకాల ఉమ, దాసరి షణ్ముఖరావు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ నిక్కి రామకృష్ణ సోమవారం తెలిపారు. ఈ ఇద్దరు విద్యార్థులను ఈనెల 25న చీపురుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా సత్కరించనున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో మునకాలు ఉమ 959, దాసరి షణ్ముఖరావు 754 మార్కులు సాధించి కాలేజీలో టాపర్‌లుగా నిలిచారన్నారు.

గంట్యాడ: 'జగనన్న ఆణిముత్యాలు' పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న నగదు ప్రోత్సాహకానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన అరిపాక జ్యోత్స్న ఎంపికైంది. విద్యార్థిని జ్యోత్స్న ఇంటర్మీడియట్ హెచ్ఈసీ గ్రూపులో వెయ్యికి 908 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో టాపర్‌గా నిలవడంతో ఆమెకు ఈ అవార్డు వరించిందని ప్రిన్సిపాల్ ఎల్.వి.ఎస్.జగన్నాథరావు తెలిపారు. ఈ నెల 25న నియోజకవర్గ స్థాయిలో, 27న జిల్లా స్థాయిలో అవార్డులు ప్రాధాన చేయనున్నారు.

# మురుగు సమస్య పరిష్కారం



సీసీ కాలువల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, వైస్ సర్పంచ్, తదితరులు

గజపతినగరం: పట్టణంలోని జయంతి కాలనీలో గత కొన్నేళ్లుగా నెలకొన్న మురుగు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించనుంది. కాలనీలో కాలువలు లేకపోవడంతో మురుగునీరు వీధుల్లో చేరి నిల్వ ఉండేది. దీంతో దోమలు, ఈగలు విజృంభించి స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేసేవి. ప్రజలు రోగాల బారిన పడేవారు. కాలువలు నిర్మించాలని గత ప్రభుత్వంలో పలుమార్లు అధికారులు, స్థానిక నాయకులను కోరినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సహకారంతో డ్రైనేజీల నిర్మాణానికి గ్రామ సర్పంచ్ నరవ కొండమ్మ, వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు సోమవారం శంకుస్థాపన చేశారు. ఎట్టకేలకు డ్రైనేజీల నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### పేదల సంక్షేమాన్ని వ్యతిరేకిస్తే..

# ప్రజా వ్యతిరేకత తప్పదు



మూడురోడ్ల జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తవలస: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 18న ఎస్.కోటలో నిర్వహించిన సభలో ఎస్సీ, ఎస్టీ, పేద, బడుగు బలహీన వర్గాలను ఉద్దేశించి మాట్లాడిన తీరును రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబుతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు కొత్తవలస మూడురోడ్ల జంక్షన్‌లో సోమవారం భారీ మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. పేదల సంక్షేమాన్ని వ్యతిరేకిస్తే.. ప్రజా వ్యతిరేకత తప్పదంటూ నినాదాలు చేశారు. జగనన్న సంక్షేమానికి జగమంతా జేజేలు పలుకుతుంటే చంద్రబాబు తట్టుకోలేక ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని, పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను శ్మశానాలు అంటూ తప్పుడు కూతలు కూస్తున్నారని మండిపడ్డారు. పేదల సంక్షేమాన్ని అడ్డుకుంటున్న టీడీపీ రానున్న ఎన్నికల్లో పుట్టగతులు లేకుండా పోతుందని ధ్వజమెత్తారు. అంతకుముందు చంద్రబాబు దిష్టిబొమ్మను మూడు రోడ్ల జంక్షన్‌లో ఊరేగిస్తూ బాబు వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. అనంతరం చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. కాగా దిష్టిబొమ్మను దహనం చేసే సమయంలో పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, వైస్ ఎంపీపీ కర్రి శ్రీను, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ ఎం.రామస్వామి, పార్టీ నాయకులు మేలాస్త్రి అప్పారావు, గొరపల్లి రవికుమార్, బొంతల వెంకటరావు, పలు గ్రామాలు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



అరకు-విశాఖ రోడ్డులో వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన ర్యాలీ

### ప్రతీ సమస్యకు పరిష్కారం చూపండి

బొండపల్లి: స్పందనలో వచ్చిన ప్రతీ సమస్యను పరిశీలించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎ.వేదవతి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమై స్పందన ఫిర్యాదుల పరిష్కారంపై పలు సూచనలు చేశారు. నిర్దేశిత సమయంలోగా ఫిర్యాదులపై విచారణ చేసి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఈఓపీఆర్డీ సీహెచ్.సుగుణకరరావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు మండల సమావేశం

మెరకముడిదాం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరుకానున్నారని తెలిపారు. మండలానికి చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన సూచించారు.


### నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

గజపతినగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల నిర్వహణ, మరమ్మతు పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ ఎస్.కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు గజపతినగరం టౌన్‌లో, అలాగే జిన్నాం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సెకండ్ సర్క్యూట్ ఎల్‌సీ ఏర్పాటు చేస్తున్నందున మండలంలోని అన్ని గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు వెల్లడించారు.

### సచివాలయ ఉద్యోగులతో సమీక్ష

వేపాడ: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ఎంపీడీఓ బీఎస్ఎస్‌కే పట్నాయక్, పంచాయతీరాజ్ ఏఈ ఆలీ పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ప్రయారిటీ వర్కులు, నాన్ ప్రయారిటీ వర్కులు, జగనన్నకు చెబుదాం, ఫ్యామిలీ డాక్టర్ సేవలు తదితర అంశాలపై చర్చించారు. ఆయా కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించేలా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# 81 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ రత్నంరాజు

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట హర్షవర్ధన హైస్కూల్ సమీపంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సహాయ స్ఫూర్తి ఫౌండేషన్, అమ్మ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ రత్నంరాజు సుమారు 81 మందికి కంటి పరీక్షలు చేశారు. అందులో 40 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. వారికి విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్లు చెప్పారు. సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ సెక్రటరీ రేవంత్, అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు సురేష్, వెంకటరమణ, విశ్వనాథ్, తాతినాయుడు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఫ్యాషన్ టెక్నాలజీలో రాణించాలి



కుట్టుమిషన్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ గార తవుడు, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక

గజపతినగరం: ప్రస్తుతం ఫ్యాషన్ టెక్నాలజీకి మంచి డిమాండ్ ఉందని, మహిళలు ప్రభుత్వం అందించే టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఫ్యాషన్‌రంగంలో రాణించాలని జెడ్పీటీసీ గార తవుడు, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో కుట్టుశిక్షణ తీసుకున్న నలుగురు మహిళలు మెంటాడ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన టైలరింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వం అందించే శిక్షణను సద్వినియోగం చేసుకుని జీవనోపాధి పొందడమే కాకుండా, మరో పది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న మామిడి సంధ్య, గాయిత్రి, మాలతి, గౌరిలను జెడ్పీటీసీ, ఎంపీపీ అభినందించారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, ప్రతి ఒక్కరూ వాటిని వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, స్థానిక నాయకులు బెల్లాన త్రినాథరావు, గిడిజాల కామునాయుడు, వెలుగు ఏపీఎం యు.జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వేంకటేశ్వరస్వామి పెళ్లిరాట కార్యక్రమం



స్వామివారి పెళ్లిరాట కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ ఆదిలక్ష్మి దంపతులు, భక్తులు

జామి: భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి జూన్ 4 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి సోమవారం వేదపండితులు, గ్రామ సర్పంచ్ పిన్నింటి ఆదిలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పెళ్లిరాట కార్యక్రమం ఘనంగా చేపట్టారు. ఈ నెల 30న పంచామృతాభిషేకం, యాగశాల అర్చన, 31న స్వామివారి కల్యాణం, సుప్రభాత ఆరాధన, హోమాలు, జూన్ 1న శ్రీవారి గరుడసేవ, 2న తులాభార సేవ, 3న దొంగల దోపిడీ ఉత్సవం, 4న వసంతోత్సవం, పుష్ప యాగం తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు స్వామివారి కల్యాణానికి రూ.500, ఆరు రోజుల పాటు ప్రత్యేక పూజలకు రూ.100 చెల్లించి పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.